నమస్తే తెలంగాణ
# నల్లగొండ
I | నల్లగొండ, సోమవారం 7 ఏప్రిల్ 2025 | NALGONDA


పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, సునీత దంపతులు

## మన సంస్కృతి ప్రపంచ దేశాలకు ఆదర్శం

### సీతారాముల కల్యాణోత్సవంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 6 : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మన వివాహ వ్యవస్థ చాలా గొప్పదని, మన కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యం ప్రపంచ దేశాలకు తెలిసిందని పేర్కొన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేదాంత భజన మందిరంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో జగదీశ్‌రెడ్డి దంపతులు పాల్గొని పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. అనంతరం శ్రీరామ్‌నగర్‌లోని విజయాంజనేయస్వామి దేవాలయంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ మానవ జాతిని ముందుకు నడపడంలో వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ ఎంతో ముఖ్యమైనవన్నారు. అలాంటి పవిత్రమైన వివాహ బంధాన్ని చెప్పాలంటే సీతారాముల కల్యాణంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వేలాది సంవత్సరాలుగా శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం చాలా గొప్ప విషయమని చెప్పుకొచ్చారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగానూ శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అభిజిత్ లగ్నం శుభ ముహూర్తాన ఊరూవాడ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిపించారు. పలుచోట్ల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు వేడుకల్లో పాల్గొన్నారు.

# కోతలు జోరందుకున్నా కొనుగోలు కేంద్రాలేవి?

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాత నష్టాలపాలు

- మిల్లర్లు, వ్యాపారులు చెప్పిందే రేటు
- సమావేశాలకే పరిమితమైన అధికార యంత్రాంగం
- ఇప్పటికే ఎండిన పంటలతో కుదేలైన రైతులు
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని వేడుకోలు

సూర్యాపేట, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : ఈ యాసంగి సీజన్‌లో సూర్యాపేట జిల్లాకు గోదావరి జలాలు రాకపోవడంతో లక్ష ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. మిగిలిన కొద్దిపాటి పంటను శతవిధాలా ప్రయత్నించి కాపాడుకున్న రైతులకు మార్కెట్లో మద్దతు ధర కరువైంది. ఓ వైపు వరి కోతలు జోరుగా సాగుతుండగా ఇంకా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు మాత్రం తెరుచుకోలేదు. దాంతో మిల్లర్లు, దళారులు చెప్పిందే చెప్పిందే ధరై కూర్చుంటున్నది. కాగా, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే గతం కంటే ధాన్యం తక్కువ వస్తుంది.. ఎండిన పంట లెక్క తేలుతుందని తెరువడం లేదా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఇరవై రోజుల వ్యవధిలో అధికారులు మూడు సార్లు మీటింగ్ పెట్టి చర్చించారు తప్ప ఒక్కటంటే ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించలేదు. ఇప్పటికే జిల్లాలోని నాగార్జునసాగర్ ఆయకట్టులో 50 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. ఎస్‌ఆర్‌ఎస్పీ ఆయకట్టులో 30 శాతం పూర్తయ్యాయి. ఒక్క గోదావరి ఆయకట్టు పరిధిలోనే 2.50లక్షల్లో రైతులు వరి నాటు పెట్టగా, సాగునీరు లేక లక్ష ఎకరాలకు పైగా ఎండిపోయింది. ఉన్న కొద్ది పంటనైనా కాపాడుకోవాలని రైతులు నానా కష్టాలు పడ్డారు. లక్షల రూపాయలు అప్పులు చేసి బోర్ల మీద బోర్లు వేశారు. వాటిల్లోనూ నీళ్లు రాకపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొనుగోలు చేసి తడులు అందించారు. తీరా కొద్దోగొప్పో చేతికి వచ్చిన పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇదే అదునుగా మిలర్లు, వ్యాపారులు సిండికేట్ అయ్యి ధర తగ్గించి రైతులను దోచుకుంటున్నారు.

## జోరుగా వరి కోతలు... కనిపించని కొనుగోలు కేంద్రాలు

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలోని కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఇరవై రోజుల నుంచి వరి కోతలు నడుస్తున్నాయి. కాళేశ్వరం పరిధిలో గోదావరి ఆయకట్టు ఉన్న తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో వారం క్రితం ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 30 శాతం పూర్తయ్యాయి. కానీ, నేటికీ జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. దాంతో రైతులు గత్యంతరం లేక ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే మద్దతు ధర క్వింటాకు రూ.2,302తోపాటు బోనస్ 500 కలిపి రైతుకు రూ.2,800 వరకు వస్తుంది. కానీ, మిలర్లు మాత్రం రూ.2వేల నుంచి 2,200కి మించి ధర పెట్టడం లేదు. కోతలు ఊపందుకుని ధాన్యం లోడ్లు వస్తున్న కొద్దీ ధర తగ్గిస్తున్నారు. మరోవైపు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో దొడ్డు రకం ధాన్యానికి మోడల్ ప్రైస్ రూ.1,900లోపే ఉంటున్నది. పైగా తేమ, బస్తా పేరిట రెండు కిలోల తరుగు తీస్తున్నారని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల కోసం సమావేశాలు పెట్టిన జిల్లా అధికారులు ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం విస్మయం గొల్పుతున్నది.


కేంద్రాలు తెరుచుకోకపోవడంతో నాగారం మండల పరిధిలోని మిల్లుల్లో ధాన్యం ట్రాక్టర్లు

### ఐకేపీ కేంద్రం పెట్టకపోవడం వల్ల 56 వేలు నష్టపోయాను



ప్రభుత్వం ఐకేపీ సెంటర్లు తెరువకపోవడంతో నేను పండించిన 142 క్వింటాళ్ల దొడ్డు రకం వడ్లను మిల్లుకు అమ్ముకున్నా. కింటాకు రూ.1,900 ధర మాత్రమే ఇచ్చారు. ఏవో కాకి లెక్కలు చెప్పి రూ.4,500 విలువ చేసే రెండున్నర కింటాలు తరుగు తీసి 140 క్వింటాలకు డబ్బులు కట్టిచ్చారు. అదే ఐకేపీ సెంటర్‌లో అమ్ముకుని ఉంటే మద్దతు ధర రూ.2,302 దక్కేది. తరుగు ఉండకపోయేది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం వల్ల 56వేల రూపాయలు నష్టపోయాను.

-కన్నెబోయిన మల్లేశ్, రైతు, నాగారం







## కల్తీ మద్యం కేసులో ఐదుగురి అరెస్ట్

- 600 లీటర్ల స్పిరిట్, 660 లీటర్ల కల్తీ మద్యం స్వాధీనం
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్


నకిలీ మద్యం బబుల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, ఏప్రిల్ 6 : కల్తీ మద్యం తయారు చేస్తున్న ఐదుగురిని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 600 లీటర్ల స్పిరిట్, 660 లీటర్ల కల్తీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చండూరు మండల కేంద్రానికి చెందిన ఎర్రజెల్ల రమేశ్, మహ్మద్ జానీ పాషా, సాయం ఉపేంద్ర, కనగల్ మండలం జి.ఎడవెల్లికి చెందిన బొమ్మరబోయిన భార్గవ్, చండూరు మండలం కస్తాల గ్రామానికి చెందిన జాల వెంకటేశ్‌పాటో మరో ఇద్దరు కలిసి కర్ణాటకకు చెందిన శ్రీనివాస్‌గౌడ్ ద్వారా ముడి సరుకు తెప్పించుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. 2019లో హైదరాబాద్ శివారులో నకిలీ మద్యం తయారు చేసిన కేసులో మహ్మద్ జానీపాషాపై పలు కేసులు నమోదయ్యాయి. ఆరు నెలల క్రితం శ్రీనివాస్‌గౌడ్‌కు జానీపాషా ఫోన్ చేసి ఎన్నికల్లో మద్యం ఎక్కువ సేల్ అవుతుందని, నకిలీ మద్యం తయారు చేసి ఇస్తానని చెప్పాడు. రూ.5లక్షలు అడ్వాన్స్ ఇస్తే రూ.10 లక్షల మద్యం తయారు చేసి ఇస్తానని ఎర్రజెల్ల రమేశ్, దోమలపల్లి యాదగిరితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. తయారు చేసిన మద్యాన్ని నాంపల్లి మండల కేంద్రంలోని రమేశ్ తోటలో పెడుదామని నిర్ణయించుకున్నారు. జానీపాషా, రమేశ్, యాదగిరి, కర్ణాటకకు చెందిన శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఫిబ్రవరి మొదటి వారంలో 5 డ్రమ్ముల స్పిరిట్ తీసుకువచ్చి తోటలో పెట్టారు. జానీపాషా, రమేశ్, యాదగిరి రూ.2 లక్షల చొప్పున రూ.6లక్షలు జమచేసి శ్రీనివాస్‌గౌడ్‌కు ఇచ్చారు. 10 లీటర్ల సామర్థ్యం గల 40 క్యాన్లలో శ్రీనివాస్‌గౌడ్ తెచ్చిన స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారుచేసి 20 లీటర్ల పరిమాణం గల 40 బబుల్స్‌లో మూడు రోజులు పులియబెట్టారు. ఆ తరువాత ఒక బబుల్‌ను రూ.10 వేలకు అమ్మాలని శ్రీనివాస్‌గౌడ్ చెప్పాడు. మునుగోడులో వైన్‌షాప్ పార్ట్‌నర్ అయిన జాల వెంకటేశ్‌ను అడుగగా ప్యాకింగ్ సరిగ్గా లేదని, సరిగ్గా ఉంటే తీసుకుంటానని చెప్పాడు. జానీపాషా డ్రైవర్ సాయం ఉపేంద్ర కల్తీ మద్యం పలు ప్రదేశాలకు చేరవేసే క్రమంలో నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు పట్టుకుని విచారించారు. కల్తీ మద్యం గుర్తించి కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. మరోవైపు చండూరు మండలం దుబ్బగూడెం గ్రామంలో ఒక గుడిసెలో నిందితులకు సంబంధించిన 20 బబుల్స్‌లో ఉన్న 400 లీటర్ల మద్యాన్ని స్వాధీనపర్చుకుని ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకున్న దేవరకొండ ఏఎస్పీ మౌనిక, టాస్క్‌ఫోర్స్ సీఐ ఎ.రమేశ్ బాబు, ఎస్‌ఐలు మహేందర్, శివప్రసాద్, నాంపల్లి సర్కిల్ సీఐ శ్రీరాజు, ఎస్‌ఐ శోభన్ బాబు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## బలవంతపు బదిలీలు!

### ఇష్టం లేకున్నా వెళ్లిపోవాల్సిందే.. ఆలేరులో ఓ కీలక ప్రజాప్రతినిధి హుకుం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 6 : 'మాకే కాదు.. మా పార్టీ క్యాడర్‌కు నచ్చకపోయినా బదిలీలు తప్పవు. ఇష్టం లేకున్నా వెళ్లాల్సిందే.. భరించాల్సిందే'నని ఆలేరు నియోజకవర్గంలోని ఓ కీలక ప్రజాప్రతినిధి అధికారులపై బెదిరింపులకు దిగుతున్నారు. 'తప్పు.. ఒప్పు అంటూ చెప్పొద్దు. మేం చెప్పిన పనులను 60 శాతమో, 30 శాతమో కాదు.. వంద శాతం చేయాల్సిందే. లేకపోతే ఇక్కడ ఉండడానికి వీల్లేదు' అంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇటీవల యాదగిరిగుట్ట ఎంపీఓ సలీమ్‌ను మోటకొండూర్‌కు బదిలీ చేసి, అక్కడ పని చేస్తున్న చంద్రశేఖర్‌ను గుట్టకు తీసుకురావాలని కొందరు పంచాయతీ కార్యదర్శులు ఓ మాజీ ఎంపీపీని కలిసి విన్నవించుకున్నారు. ఆయన సదరు కీలక ప్రజాప్రతినిధిపై ఒత్తిడి తీసుకువచ్చి సలీమ్‌ను మోటకొండూరుకు బదిలీ చేయించగా.. నేడో, రేపో ఉత్తర్వులు అందనున్నట్లు తెలిసింది. కాగా, చంద్రశేఖర్ యాదగిరిగుట్టకు రావడానికి ఆస్తకిగా లేనట్లు సమాచారం. వాస్తవానికి ఆయన నాలుగేండ్లపాటు యాదగిరిగుట్టలో పని చేశారు.

#### యాదగిరిగుట్ట సీఐపైనా!

యాదగిరిగుట్ట పట్టణ సీఐ త్వరలో బదిలీ కానున్నట్లు కూడా ప్రచారం జరుగుతున్నది. సీఐ తమకు అనుకూలంగా పని చేయడం లేదని, అన్నీ రూల్స్ మాట్లాడుతున్నారని, ఆయన ఉంటే మన పనులు సాగవని సీఐతోపాటు ఏసీపీని కూడా బదిలీ చేయాలన్న యోచనలో సదరు కీలక నేత ఉన్నట్లు సమాచారం. గతంలో పట్టణ సీఐగా పని చేసిన శంకర్ గౌడ్‌ను తీసుకువచ్చే పనిలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. గతంలో సీఐగా పని చేసి ఏసీపీగా పదోన్నతి పొంది హెచ్‌ఎండీఏలో పని చేస్తున్న జానకిరెడ్డిని గుట్ట ఏసీపీగా తీసుకురావాలని తీవ్ర ప్రయత్నాలు సాగుతుండగా.. ఆయన ఇక్కడికి రావడానికి సుముఖంగా లేనట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో ఆలేరు నియోజకవర్గంలో పని చేయాలంటే ఇబ్బందిగా ఉందని పలువురు అధికారులు వాపోతున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు వచ్చి తమ పని చేసి పెట్టాల్సిందేనని, లేకపోతే తమ 'నేత'తో చెప్పి బదిలీ చేయిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు సహా అన్ని విభాగాల అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.






















